ప్రజాశక్తి
శనివారం 24 మే 2025
5
అల్లూరి సీతారామరాజు



2న వాలీబాల్ శిక్షణకు ఎంపికలు

ప్రజాశక్తి -పాడేరు : స్పోర్ట్స్ అథారిటీ అఫ్ ఇండియా రెసిడెన్షియల్ అకాడమీలో వాలీబాల్ శిక్షణకు వచ్చేనెల 2న ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఎ. జగన్మోహనరావు ప్రకటనలో తెలిపారు. 190 సెంటిమీటర్ల కన్నా ఎక్కువ ఎత్తు, బాలికలకు 170 సెంటీమీటర్లు పైబడిన ఎత్తు కలిగిన ఆసక్తిగలవారు హాజరు కావాలని సూచించారు. 14-16 ఏళ్ల మధ్యవారు, 16ఏళ్లు పైబడిన వారు ఇలా రెండు కేటగిరీలు బాలబాలికలను శిక్షణకు ఎంపిక చేస్తారని, ఆటలో అనుభవం లేకపోయినప్పటికీ అసాధారణ ఎత్తును పరిగణనలోకి తీసుకుంటారన్నారు. ఆసక్తిగలవారు ఆధార్, జనన ధ్రువీకరణ, ఐదు పాస్‌పోర్టుసైజు ఫొటోలు, స్పోర్ట్స్, మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్లతో 2న ఉదయం 7గంటలకు విశాఖపట్నంలోని అక్కయ్యపాలెం పోర్టుస్టేడియానికి హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు 94916 07748 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఎండియు వ్యవస్థను కొనసాగించాలి



మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి కె.రామారావు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: ప్రభుత్వం ఎండియు వ్యవస్థను రద్దు చేయడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటారని సిపిఎం మండల కార్యదర్శి కె రామారావు అన్నారు.శుక్రవారం అరకులోయ మండల కేంద్రంలోని ఆదివాసి గిరిజన సంఘం భవనంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.డిపో ద్వారా రేషన్ సరుకులు పంపిణీ చేస్తామన్న ప్రభుత్వ నిర్ణయాన్ని గిరిజన ప్రాంతంలో తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు.ఏజెన్సీ ప్రాంతంలో రోడ్డు, రవాణా వ్యవస్థ సక్రమంగా లేనందున కాలినడకతో వర్షాకాలంలో కొండలు, గుట్టలు,వాగు దాటి డిపోలకు చేరుకుని రేషన్ సరుకులు తీసుకుని మళ్ళీ ఇంటికి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి ఉంటుందన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టం చేయాల్సిన ప్రభుత్వం ఇలా నిర్వీర్యం చేసే విధంగా ఎండియులను రద్దు చేయాలనుకోవడం సరికాదని, తక్షణమే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. చౌక దుకాణాల ద్వారా ప్రజలకు అవసరమైన 14 రకాల సరుకులు సబ్సిడీ ద్వారా సక్రమంగా పేదలకు అందించాలన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తామనే వాగ్దానం అమలు చేసి నాణ్యమైన బియ్యం పేదలకు అందించాలన్నారు.ఏజెన్సీ గిరిజన ప్రాంతంలో డిఆర్ డిపోలకు భవనాలు మంజూరు చేయాలని, మరమ్మతులకు గురైన భవనాలను మరమ్మతులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల నాయకులు గెమ్మెలి చిన్నబాబు, జన్ని భగత్ రామ్, పాంగి రామన్న పాల్గొన్నారు.

ఏజెన్సీ గ్రామాలకు మినహాయింపునివ్వాలి

ప్రజాశక్తి- హుకుంపేట: రేషన్ వాహనాలను తొలగించి, మళ్లీ డిపోల ద్వారా నిత్యావసరాల పంపిణీకి ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో ఏజెన్సీ ప్రాంతంలో రేషన్ బళ్ల తొలగింపునకు మినహాయింపు ఇవ్వాలని ఆదివాసీ గిరిజన మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఎస్ హైమావతి కోరారు. శుక్రవారం మీడియాతో మాట్లాడతూ ఏజెన్సీ ప్రాంతంలో రేషన్ సరుకుల కోసం అనేక గ్రామాలకు అందుబాటులో లేకుండా దూరాన ఉన్న డిపోల వద్దకు వెళ్లాలంటే గిరిజనులు ఇబ్బందులు పడే పరిస్థితి మళ్లీ ఎదురౌతుందన్నారు. ప్రస్తుతం రేషన్ వాహనాల ద్వారా పంపిణీ జరుగుతుండడంతో ఆయా లబ్ధిదారుల ఇళ్ల వద్దకు కాకపోయినా, ఆయా గ్రామాలకు అందుబాటులోకి సరుకులను తెచ్చి ఇస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో మళ్లీ డిపోలకే రేషన్ సరుకుల పంపిణీని అప్పగిస్తే గిరిజనులు కాలినడకన ఐదు నుంచి పది కిలోమీటర్లు దూరం నడిచి వెళ్లక తప్పని పరిస్థితి వస్తుందన్నారు. రేషన్‌డిపోల ద్వారా కాకుండా ప్రస్తుతమున్న ఎండిఎం వాహనాల ద్వారా ఏజెన్సీలో సరుకులు పంపిణీని కొనసాగించాలని, ఈ విషయంలో ఏజెన్సీ గ్రామాలకు మినహాయించాలని హైమావతి కోరారు.

ఫైబర్‌నెట్ సదుపాయం కల్పించండి



గెమ్మలి సచివాలయం వద్ద గిరిజనులతో మాట్లాడుతున్న చిన్నయ్యపడాల్

ప్రజాశక్తి -జి.మాడుగుల మండలంలోని గెమ్మలి సచివాలయంలో ఇంటర్నెట్ సదుపాయం లేక వివిధ పనులపై సుదూర గ్రామాల నుంచి వచ్చే గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు సాగిన ధర్మన్న పడాల్ ఆవేదన వ్యక్తం చేశారు. గెమ్మలి సచివాలయానికి తక్షణమే ఫైబర్‌నెట్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం గెమ్మలి సచివాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రేషన్ కార్డుల్లో పేర్లు నమోదు, కొత్త రేషన్ కార్డులతో చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలతో కుటుంబాలుగా దాదాపు పది కిలోమీటర్ల దూరం నుంచి అనేకమంది వచ్చి ఇబ్బందులు పడుతున్నారన్నారు.అయితే సచివాలయంలో నెట్‌సదుపాయం లేకపోవడంతో వారంతా పడిగాపులు పడుతున్నారని, సాయంత్రం వరకు వేచిచూసి, పని జరగకుండానే తిరుగుముఖం పట్టాల్సిన దుస్థితి నెలకొందన్నారు. నాలుగేళ్లుగా ఇదే పరిస్థితి ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ధర్మన్నపడాల్ దృష్టికి గిరిజనులు తెచ్చి ఆవేదన వెలిబుచ్చారు. దీనిపై ఉన్నతాధికారులు, ప్రభుత్వం తక్షణమే తగు చర్యలు చేపట్టాలని చిన్నయ్యపడాల్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కులపాడు పిసా కమిటీ కార్యదర్శి సభ్యులు గబ్బడి ఈశ్వరరావు. సంపంగిపుట్టు పిసా కార్యదర్శి నాగేశ్వరరావు, బాధితులు అర్లాబు సత్యనారాయణ వివిధ గ్రామాల నుంచి వచ్చిన గిరిజనులు ఉన్నారు

పాఠశాల మంజూరు చేయరూ!

జిల్లా కలెక్టర్‌కు రీడేబంధ పివిటిజి గ్రామస్తుల వినతి



జిల్లా కలెక్టర్‌కు విన్నవించేందుకు వచ్చిన రీడేబంధ పివిటిజి గ్రామస్తులు

ప్రజాశక్తి హుకుంపేట : మండలంలోని రాప పంచాయతీ రీడేబంధ పివిటిజి గ్రామానికి పాఠశాల మంజూరు చేయాలని తడిగిరి వైస్ సర్పంచ్, సిపిఎం మండల నాయుడు కిల్లో రామారావు కోరారు. శుక్రవారం ఐటిడిఎ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో కలెక్టర్ దినేష్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిల్లో రామారావు మాట్లాడుతూ గ్రామంలో 40 మంది బడి ఈడు పిల్లలున్నారని, వారంతా చదువుకు దూరమౌతున్నారన్నారు. పాఠశాల పున:ప్రారంభానికి ముందే గ్రామంలో పాఠశాలకు వసతి సౌకర్యం కూడా కల్పించాలని, తద్వారా మున్ముందు వర్షాల సీజన్‌లో విద్యార్థులు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ, పాఠశాల మంజూరు అయ్యేంతవరకు తాత్కాలికంగా వాలంటీర్ ద్వారా విద్యా బోధన అందిస్తాయమని తెలిపారు. కార్యక్రమంలో సీదరి మల్లేష్, చిన్నారావు, మహేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

- అధికారులతో సమీక్షలో జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు టౌన్: రెవెన్యూ సదస్సులలో స్వీకరించిన భూసమస్యల అర్జీల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్‌కుమార్ ఆదేశించారు. పిజిఆర్ఎస్‌కు భూసమస్యల ఫిర్యాదులు పునరావృత మౌతున్నాయని, ఇది సరికాదని సూచించారు. శుక్రవారం ఐటిడిఎ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ వివిధ శాఖలలో అపరిష్కృతంగా ఉన్న ఫిర్యాదుల పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. రెవెన్యూ అధికారులు మ్యుటేషన్ల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి శుక్రవారం పాడేరు, సోమవారం రంపచోడవరం, ప్రతి బుధవారం చింతూరు ఐటిడిఎలతోపాటు ప్రతిసోమవారం జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లోనూ తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల్లో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో స్వీకరించిన అర్జీలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదుచేసి, పరిష్కారచర్యలు చేపట్టాలని, ఏం చర్యలు తీసుకున్నారో అర్జీదారునికి తెలియ పరచాలన్నారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఇతర మంత్రుల కార్యాలయాల నుంచి వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అర్జీదారులు తమ ఫిర్యాదుల పరిష్కార చర్యలపై వివరాలకు 1100 టోల్‌ఫ్రీ నెంబరును సంప్రదించాలన్నారు.

అన్ని శాఖల సిబ్బందితో యోగా

ఈ నెల 21 నుండి వచ్చే నెల 21 వరకు అన్ని శాఖలు అధికారులు, ఉద్యోగులు విధిగా యోగాలో పాల్గొనాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. యోగ సాధన జీవితంలో ఒక భాగం కావాలన్నారు. మాస్టర్ ట్రైనీల ఎంపిక, ప్రతి సచివాలయం నుండి ఏడుగురు ట్రైనర్ల ఎంపిక వేగవంతం చేసి యోగ సాధకులకు పోటీలు నిర్వహించాలన్నారు. యోగ సాధనకు ఆన్లైన్ నమోదులు పెరగాలన్నారు.



వేసవి క్రీడా శిక్షణకు కిట్లు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

వేసవి శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ విద్యార్థులకు విజ్ఞప్తి చేసారు. జిల్లాలో 16 క్రీడాంశాలలో 50 శిక్షణా శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. శిక్షకులకు రూ.2.50 లక్షల విలువైన వివిధ క్రీడా పరికరాలను జిల్లా కలెక్టర్ అందజేశారు. వాటిని సద్వినియోగం చేసుకుని, ఉత్తమ శిక్షణ అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌డిసి డిడి ఎంవిఎస్.లోకేశ్వరరావు, టిడబ్ల్యూ ఎల్.రజని, డిపిఆర్ఒ పిఎస్ కుమార్, ఆర్అండ్‌బి ఇంజినీరు బాలసుందరబాబు, ఆర్ డబ్ల్యూఎస్ ఇఇ జవహార్ కుమార్, పిఆర్ ఇఇ టి.కొండయ్య పడాల్, పాడేరు తహశీల్దార్ వి.త్రినాధరావు నాయుడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వారం రోజులుగా అంధకారంలోనే...

- పిడుగుపాటుకు దగ్ధమైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు
- పాడైన జియో టవర్ : పట్టించుకోని అధికారులు

పజాశక్తి-అనంతగిరి : మండలంలోని అనంతగిరి పంచాయతీ రాజుపాక గ్రామం వారం రోజులుగా అంధకారం లోనే ఉంది. వారం రోజుల క్రితం పిడుగుపాటుకు గ్రామంలో రెండు ట్రాన్స్‌ఫార్మర్లు పాడయ్యాయి. అంతేకాక ఈదురుగాలులు, పిడుగుల ధాటికి రాజుపాక గ్రామంతో జియో సెల్‌టవర్ కూడా దెబ్బతింది. పిడుగుపడిన తర్వాత జియో సెల్‌టవర్, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి నాలుగు రోజులపాటు పొగల వ్యాపించడంతో అటుగా వెళ్లేందుకు గ్రామస్తు లెవరూ సాహసించ లేదు. సంబంధిత విద్యుత్‌శాఖ సిబ్బంది తొలగించేం దుకు ప్రయత్నించి నప్పటికీ మంటలు చెలరేగడంతో వదిలి వేశారు.



పాడైన జియోటవర్ పరికరాలు

కాగా నెలరోజుల క్రితం పాడైన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఇటీవల ఈనెల 17న పునరుద్ధరించి, విద్యుత్ సరఫరా ఇచ్చారు. ఇంతలోనే పిడుగుపాటుకు మళ్లీ కొత్తగా ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్ పాడై, అంధకారంలో మగ్గడంతో ఆవేదన చెందుతున్నారు. తక్షణమే పాడైన ట్రాన్స్‌ఫార్మర్ల స్థానే కొత్తవి ఏర్పాటుతోపాటు జియో సెల్‌టవర్‌ను బాగుచేసి సేవలు పునరుద్ధరించాలని గ్రామస్తులు రాజు, సుబ్బారావు, భీమన్న తదితరులు కోరుతున్నారు.



వారం రోజుల క్రితం వేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ (ఫైల్)

ప్రమాదకరంగా ఆకతాయిల బైక్ డ్రైవింగ్

- రోడ్లపైకి వచ్చేందుకు భయపడుతున్న స్థానికులు
- రేసులను తలపిస్తున్న వేగం
- వాహనాలు గుర్తించేందుకు అవకాశం లేకుండా నంబర్ బోర్డుల తొలగింపు
- పోలీసుల పర్యవేక్షణ కరవు

ప్రజాశక్తి - రంపచోడవరం : ఆకతాయిలు మితిమీరిన వేగంతో బైక్ రైడ్‌లు చేస్తుండడంతో స్థానికులు రోడ్లపైకి వచ్చేందుకు భయభ్రాంతులు అవుతున్నారు. రంపచోడవరంలోని స్థానిక డిగ్రీకళాశాల రోడ్డు నుండి మొదలుకుని జూనియర్ కళాశాల, ఆర్టీసి కాంప్లెక్స్, అంబేద్కర్ సెంటర్, దేవిగుడి, ఐటిడిఎ మీదుగా పిఎంఆర్సి వరకూ ఆకతాయిలు మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతూ ఉండడంతో తరచూ పలుచోట్ల రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. దీంతో రోడ్లపై నడిచేందుకు కూడా స్థానికులు భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు అయితే రోడ్లపై తిరగలేని పరిస్థితులు నెలకొన్నాయి. రేసులను తలపించే వేగంతో వారు బైక్ నడుపుతున్నారు. రేష్ డ్రైవింగ్ చేసేవారిలో యువకులతో పాటు మైనర్ బాలురు కూడాఉండడం గమనార్హం. జూనియర్ కళాశాల సెంటర్ నుండి బస్టాండ్, అంబేద్కర్ సెంటర్ వరకూ ఉదయం, సాయంత్రం బైకులు వేగంగా నడుపుతున్నారని బ్యాంక్ సమయాల్లో వివిధ పనులు నిమిత్తం రోడ్డు దాటి వెళ్లాల్సి వస్తే ఎటునుంచి ఎవరు వచ్చి గుద్దుతారో అని భయపడాల్సి వస్తోందని గ్రామస్తులు వాపోతున్నారు. ఆర్టిసి కాంప్లెక్స్ యూనియన్ బ్యాంక్ ఎదురుగా తరుచూ ఎదో ఒక సమయంలో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. కాలేజీలు, పాఠశాలలు ఉన్న సమయం లో అయితే బోర్నగూడెం నుండి రంపచోడవరం అంబేద్కర్ సెంటర్ మధ్య ఉన్న పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు హాస్టళ్ల నుండి ఉదయం సాయంత్రం వెళ్లే సమయంలో వీరి తాకిడి ఎక్కువగా ఉంటోందని మధ్యలో ఉన్న ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి ప్రతిరోజూ వివిధ వైద్యసేవల నిమిత్తం వచ్చే రోగులకు వీరి వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. బైకులకు సైలెన్సర్‌కు మాఫ్లర్‌లు తొలగించి అధికంగా ధ్వని వచ్చే విధంగా నడుపుతున్నారు. ప్రధానకూడళ్ల వద్ద పోలీసులు ఉదయం, సాయంత్రం గస్తీకాసి వీరిని నియంత్రించాలని పలువురు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆయుష్మాన్ ఆరోగ్య కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు 26వ రోజు జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు ఎం.ఎస్.ఎస్ ప్రజ్ఞ మాట్లాడుతూ వైద్య,ఆరోగ్య శాఖలో ఎన్‌హెచ్ఎం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఆయుష్మాన్ ఆరోగ్య కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను రెగ్యులర్ చేయాలన్నారు. 26 రోజులుగా ఆందోళన చేస్తున్నప్పటికీ, ప్రభుత్వానికి తమ రోదన వినిపించకపోవడం బాధాకరం అన్నారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం 6 సంవత్సరాల పూర్తి చేసుకున్న సిహెచ్ఒలను రెగ్యులర్ చేసి ఉద్యోగభద్రత కల్పించాలన్నారు. ఎన్‌హెచ్ఎం ఉద్యోగులతో సమానంగా 23శాతం వేతనం పెంచి చెల్లించాలన్నారు. పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించాలన్నారు. ఈపిఎఫ్ పునరుద్ధరించాలన్నారు. పిఎఫ్ కటింగ్ రెండు సంవత్సరాలుగా నిలిపివేయడం సరికాదని, పాతపద్ధతిలో పిఎఫ్ కట్ చేయాలని డిమాండ్ చేశారు. క్లినిక్‌అద్దె బకాయలను వెంటనే చెల్లించాలని, నిర్దిష్టమైన జాబ్‌చార్ట్ అందించాలన్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు కార్యదర్శి గంట సుధ, మోజెస్ పాల్గొన్నారు.



జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

నేడు విశాఖ బీచ్ రోడ్డులో జిల్లా స్థాయి యోగా ఈవెంట్

హాజరుకానున్న ఇన్‌ఛార్జి మంత్రి వీరాంజనేయస్వామి

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్ : యోగా మాసోత్సవాల్లో భాగంగా శనివారం ఆర్‌కెబీచ్ రోడ్‌లో వేసిన శాశ్వతవేదిక వద్ద జిల్లాస్థాయి యోగా ఈవెంట్ జరగనుంది. ఈ మేరకు జిల్లా యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేస్తోంది. రోజూ యోగాసనాల ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో మెగా ఈవెంట్‌ను భారీ స్థాయిలో నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే జిల్లా కలెక్టర్ ఆయా శాఖల అధికారులకు ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. ఎవరెవరు ఏయే బాధ్యతలు నిర్వర్తించాలో పేర్కొన్నారు.

శనివారం జరిగే మెగా యోగా ఈవెంట్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు భాగస్వామ్యం కానున్నారని, తెలిపారు. ప్రజలు కూడా స్వచ్ఛందంగా కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.



పాల్‌రాజ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కళాశాల కార్యదర్శి రాజశేఖర్

ఘనంగా డాక్టర్ పాల్‌రాజ్ వర్ధంతి

ప్రజాశక్తి - ఎటపాక : డాక్టర్ పాల్‌రాజ్ కళాశాల వ్యవస్థాపకులు రెవెరెండ్ డాక్టర్ డి.పాల్‌రాజ్ వర్ధంతి బుధవారం కళాశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పాల్‌రాజ్ విగ్రహానికి కళాశాల కార్యదర్శి వి.రాజశేఖర్, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్యదర్శి వి.రాజశేఖర్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.ఎస్.రాజేష్, వైస్ ప్రిన్సిపాల్ వి.హతీరామ్, విభాగాధిపతులు, బోధకులు బోధనేతర సిబ్బంది ఆయన సేవలను కొనియాడారు. పాల్‌రాజ్ తన జీవితాన్ని భద్రాచలం, పరిసర గిరిజన ప్రాంతాల అభివృద్ధికి అంకితం చేశారన్నారు. 1997లో పాల్ ఇంజినీరింగ్ కళాశాలను స్థాపించి, వేలాది మంది ఇంజినీర్లను సమాజానికి అందించారన్నారు. విద్య, సేవాదృక్పథం, మానవతా విలువలతో కూడిన ఆయన జీవితం యువతకు ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన ఆశయాలను కొనసాగించేందుకు భవిష్యత్తులో ఆయన లక్ష్యాలను నెరవేర్చే విధంగా విద్యారంగంలో మరింత అభివృద్ధి సాధించాలని అందరూ సంకల్పించారు.



ఎన్నికైన వారికి నియామక పత్రాలు అందిస్తున్న ఎన్నికల అధికారి శ్రీనివాసరావు

గంగవరంలో పీసా గ్రామసభ ఏకగ్రీవం

ప్రజాశక్తి - గంగవరం : మండల కేంద్రంలో శుక్రవారం సర్పంచ్ కలుముల అక్కమ్మ అధ్యక్షతన ఏర్పాటు చేసిన పీసా గ్రామసభ ఏకగ్రీవం అయింది. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎటువంటి గొడవలకు తావు లేకుండా ఎన్నిక ప్రశాంతంగా జరిగిందని ఆయన అన్నారు. ఉపాధ్యక్షులుగా పరిషిక శివరామకృష్ణ, కార్యదర్శిగా పిల్ల చిన్నిబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ లక్ష్మణరావు, ఎస్ఐ వెంకటేష్, ఎపిఒ షణ్ముఖరావు, మాజీ ఎంపిటిసి కోసు బులియమ్మ పాల్గొన్నారు.



సీలేరు నదిలో తేలుతున్న మృతదేహం

సీలేరు నదిలో మృతదేహం

ప్రజాశక్తి - మోతుగూడెం : వై.రామవరం మండలం డొంకరాయి పోలీస్‌స్టేషన్ పరిధి సీలేరు నదిలో మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం డొంకరాయి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న మర్రిగూడ గ్రామానికి చెందిన పంగి సంతోష్‌కుమార్ ఈ నెల 21న తన తండ్రి నరసింగ్‌కి సీలేరు నదిలో స్నానం చేసి వస్తానని చెప్పి వెళ్లాడు. ఎంతసేపటికి ఇంటికి రాకపోవడంతో అతని స్నేహితులని అడగగా ఎటువంటి సమాచారం తెలియలేదు. శుక్రవారం మర్రిగూడ గ్రామానికి చెందిన ధర్మారావు సీలేరు నదిలో చేపల వేటకు వల వెయ్యగా పంగి సంతోష్‌కుమార్ మృతదేహం వలలో చిక్కుకుంది. మృతుడు తండ్రి ఫిర్యాదు మేరకు డొంకరాయి ఎస్ఐ శివకుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జివిఎంసి టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 17 వినతులు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న టౌన్‌ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కి సంబంధించి 17 వినతులు వచ్చాయని జివిఎంసి సిటి ప్లానరు కె.ధనుంజయ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో సిపిలు, డిసిపిలు, ఎసిపిలతో కలిసి ప్రత్యేకంగా టౌన్‌ప్లానింగ్ ఓపెన్‌ఫోరమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి శుక్రవారం జివిఎంసి పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించేందుకు ప్రత్యేకంగా టౌన్‌ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. జివిఎంసి పరిధిలో ప్రజలు పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి ఫిర్యాదులు, అర్జీలు మొదలైనవి ప్రతి శుక్రవారం నమోదుచేసుకోవచ్చునన్నారు.

అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలివ్వాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పట్టణాలలో పేదలందరికీ 2 సెంట్లు ఇళ్లస్థలం ఇవ్వాలని, సిపిఐ రాష్ట్రసమితి సభ్యులు ఎం.పైడిరాజు, జిల్లా కార్యదర్శి ఎస్.కె రెహమాన్ కోరారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం సిపిఐ జిల్లా కార్యాలయంలో విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఇంటి స్థలం ఇచ్చిన వారికి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చెయ్యాలన్నారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలనే డిమాండ్ల సాధన కోసం జూన్ 2వ తేదీన మండల కార్యాలయాల వద్ద తమ పార్టీ ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పి.చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులు కె.సత్యాంజనేయ, కె.వనజాక్షి, ఆర్.శ్రీనివాసరావు, ఎం మన్మథరావు, ఎన్. నాగభూషణం, సి.ఎన్.క్షేత్రపాల్ పాల్గొన్నారు.

నేడు విశాఖలో సమైక్యతా యాత్ర

- హాజరుకానున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పహల్గాంలో గత నెల 22న పర్యాటకులపై దాడికి పాల్పడిన ఉగ్రవాదులను పట్టుకొని శిక్షించాలని, ఉగ్రవాద వ్యతిరేక పోరాటాన్ని వదిలేసి వక్రబుద్ధితో మతోన్మాదాన్ని, ముస్లిం వ్యతిరేకతను రెచ్చగొట్టి దేశాన్ని బలహీనపరచడాన్ని ఖండిస్తూ, మత సామరస్యం, దేశ సమగ్రత పరిరక్షణ కోసం సిపిఎం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యాన శనివారం నగరంలో సమైక్యతా యాత్ర నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు ఈ యాత్ర ద్వారకా ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపాన ఉన్న గురజాడ అప్పారావు విగ్రహం నుంచి ఆశీలమెట్ట మీదుగా జివిఎంసి గాంధీ విగ్రహం వరకు జరుగనుంది. ఈ యాత్రలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం, వామపక్ష పార్టీల జిల్లా నాయకులు, అభ్యుదయవాదులు, పలువురు ప్రముఖులు పాల్గొననున్నారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి యత్నం

ప్రజాశక్తి -ముంచంగిపుట్టు: మండలంలోని కించుమండలో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌ను గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీకి ప్రయత్నించారు. రక్షితనీటి సరఫరా పథకానికి సంబంధించిన ఈ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను చోరీ చేసేందుకు స్తంభం నుంచి కిందకు దించారు. ఇంతలో స్థానికులు మేలుకోవడంతో ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడే వదిలి పారిపోయారు. కాగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీ చేసే క్రమంలో దాని కనెక్షన్ తొలగించి, కిందకు దించేయడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడి, రక్షిత తాగునీటి సరఫరాకు గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారు. దీనిపై స్థానిక సర్పంచ్ చెబ్బన్న విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం అందించారు. కొన్నాళ్లక్రితం జైపూర్ కూడలి, సాగర, కితలంగి పంచాయతీ పరిధి గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ ఘటనలు జరిగాయి. అయితే నాలుగేళ్ల తర్వాత మళ్లీ మరో ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి యత్నించడంతో స్థానిక గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారులు నిఘాపెట్టి తగు చర్యలు చేపట్టాలని, తక్షణమే ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించివిద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని గిరిజనులు కోరుతున్నారు.



కించుమండలో చోరీకి యత్నించిన ట్రాన్స్‌ఫార్మర్

సూపర్ 50 ఫలితాలపై అధ్యయన బృందం పరిశీలన

ప్రజాశక్తి- పాడేరు : పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన ఐటిడిఎ పరిధిలోని సూపర్ 50 గిరిజన విద్యార్థులపై రాష్ట్ర అకడమిక్ అధ్యయన సంచాలకుల బృందం అధ్యయనం చేస్తోందని గిరిజన సంక్షేమ ఉప ఎల్. రజని తెలిపారు. టెన్త్ విద్యార్థులకు పాడేరు ఐటిడిఎ పరిధిలో గుత్తులపుట్టు బాలికల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో బాలికలకు, దిగుమోదాపుట్టు బాలుర గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక బోధన అందించిన విషయం విదితమే. ప్రత్యేక శిక్షణ పొందిన విద్యార్థులు పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించారు. ఈ నేపథ్యంలో పది ఫలితాలపై రాష్ట్ర అకడమిక్ మోనిటరింగ్ యూనిట్ బృంద సభ్యులు శుక్రవారం స్థానిక లోతేరుపుట్టు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో దిగు మోదాపుట్టు ఉపాధ్యాయులతో శిక్షణ తరగతులు నిర్వహించిన విధానంపై చర్చించారు. 24న గుత్తులపుట్టు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులు, విద్యార్థినులు, తల్లిదండ్రుల సమావేశ మవుతారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గిరిజన విద్యా సంస్థల్లో వీటిని అమలు చేయాలనే యోచన చేస్తున్నారని తెలిపారు. అధ్యయనంలో గిరిజన సంక్షేమ ఉప సంచాలకులు ఎల్.రజని, బృందం సభ్యులు బి. శ్రీనివాసరావు, జి. జాన్సన్ దేవరాజు, కె. శివకుమార్, దిగుమోదా పుట్టు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి -ముంచంగిపుట్టు: మండలంలోని కుంద్రుం పంచాయతీ జాకరవలస మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న పి కొండలరావు గురువారం అనారోగ్యంతో మృతి చెందారు.కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనను కుటుంబీకులు విశాఖ కెజిహెచ్‌లో చేర్పించగా, చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించి గురువారం రాత్రి మృతి చెందారని అతని కుటుంబీకులు తెలిపారు. కొండలరావు మృతదేహాన్ని అతని స్వగ్రామం వనభంగిలో అంతక్రియలకు తరలించారు. కొండలరావు మృతి సమాచారం తెలుసుకున్న ఎంఇఒ సుందరరావు, యుటిఎఫ్, పిఆర్‌టియు, ఇతర ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు చేరుకుని బాధిత కుటుంబానికి పరామర్శించారు. కొండలరావుకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ఆహార శుద్ధి పరిశ్రమలకు అనుకూలం

- ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెడితే ప్రోత్సాహం
- రైతు బజార్లు ఏర్పాటుకు ప్రతిపాదనలు
- జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి- పాడేరు : జిల్లాలో వ్యవసాధారిత ఆహార శుద్ధి పరిశ్రమలు నెలకొల్పడానికి అనుకూలంగా ఉందని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ అన్నారు. ఫుడ్ ప్రాసెస్సింగ్ యూనిట్లు పెడితే ప్రోత్సాహిస్తామన్నారు. ఉపాధి పథకాలు అమలులో రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యలో పరిశ్రమల పార్కులు ఏర్పాటు, ఆహార శుద్ధి పరిశ్రమలు ఏర్పాటుపై వ్యవసాయానుబంధ రంగాల అధికారులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో ఒక రోజు వర్కుషాపు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని మూడు ఐటిడిఎల పరిధిలో ఆహార శుద్ధి పరిశ్రమలు, పౌల్ట్రీ పరిశ్రమలు, తేనె పరిశ్రమలు ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అదేవిధంగా రైతు బజార్లు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. తేనే పరిశ్రమలు నెల కొల్పడానికి 100 మందిని గుర్తించాలన్నారు. తేనె పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చే వారికి తగిన శిక్షణ అందిస్తామన్నారు. ప్రాజెక్టుల గుర్తింపు, శిక్షణా కార్యక్రమాలు, క్షేత్రస్థాయి పర్యటనలకు ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. గిరిజన రైతుల ఆర్థికంగా ఎదగడానికి పరిశ్రమల పార్కులు దోహదపడతాయని చెప్పారు. గిరిజన రైతులు పండిస్తున్న ఆర్గానిక్ కాఫీ, మిరియాలు, పసుపు, అల్లం వంటి పంటలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉందన్నారు. బ్యాంకు రుణాలు, పెట్టుబడులు ప్రభుత్వ శాఖల సహకారం ఏ విధంగా తీసుకోవాలి అనే అంశాలపై చర్చించారు. ఎక్కడ పరిశ్రమల పార్కులు పెడితే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందో అధికారులను, ఎఫ్ పి ఓలను అడిగి తెలుసు కున్నారు. పుట్ట గొడుగుల పెంపకానికి అనుకూల వాతావరణం ఉందన్నారు. ఆ దిశగా రైతులను ప్రొత్సహిస్తే పెద్ద ఎత్తున సాగు చేయవచ్చన్నారు.

వర్కుషాపులో పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటిడిఎల ప్రాజక్టు అధికారులు డాక్టర్ ఎంజె. అభిషేక్ గౌడ, కట్టా సింహచలం, అపూర్వ భరత్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బిఎస్ నంద్ (పర్చువల్), జిల్లా పరిశ్రమల అధికారి జి. రవిశంకర్. పశుసంవర్ధకశాఖ ఉప సంచాలకులు డాక్టర్ సిహెచ్. నరసింహులు, జిల్లా సెరికల్చర్ అధికారి అప్పారావు, స్పైసెస్ బోర్డు సీనియర్ ఫీల్డు ఆఫీసర్ బి.కల్యాణి, ఎల్‌డిఎం మాతునాయుడు, రైతు ఉత్పత్తి దారుల సంఘాలు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలని ధర్నా

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని తడిగిరి పంచాయతీ కొండచీడిపుట్టు, బర్రెంగిబంధ, మెట్టవీధి, గొంది ఊరు, బోడురాయి గ్రామాలకు తారు రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతూ ఆయా గ్రామస్తులు శుక్రవారం ఐటిడిఎ ఎదుట ధర్నా చేపట్టారు. ఇన్‌చార్జి పిఒ అభిషేక్‌గౌడకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తమ గ్రామాలు ఏర్పాటైన నాటి నుంచి నేటివరకు సరైన రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నా అధికారులు, నేతలు పట్టించుకోవడం లేదని వాపోయారు..ఐదు గ్రామాలలోనూ 500 పైబడి జనాభా కలిగి ఉన్నాయని, ప్రభుత్వం తమను పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై పిఒ స్పందిస్తూ, తక్షణమే తారురోడ్డు నిధులు మంజూరు చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో హుకుంపేట వైస్ ఎంపిపి సూడిపల్లి కొండలరావు, సిపిఎం మండల నాయకులు తడిగిరి వైస్ సర్పంచ్ కిల్లో రామారావు, కాంగ్రెస్ ఒడల నాయకులు వంతాల రామకృష్ణ, నీలకంఠం, కొండ బాబు, లింగేశ్వర రావు, మత్స్య రాజు, రాంబాబు, బాలన్న పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



ఐటిడిఎ ఎదుట ధర్నా చేస్తున్న గిరిజనులు

పిజిఆర్ఎస్‌కు 89 వినతులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: శుక్రవారం ఐటిడిఎ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ .ఎంజె అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, డిఆర్ఒ కె.పద్మలతతో కలిసి వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 89 ఫిర్యాదులను స్వీకరించారు.

హుకుంపేట మండలం శోభకోట పంచాయతీ ఈదులగొంది గ్రామస్తులు ఎం.సుబ్బారావు, ఎం.కొండబాబు తదితరులు గ్రామంలో బిటి రోడ్‌లు నిర్మించాలని వినతిపత్రం సమర్పించారు. జికె.వీధి మండలం అంతాడ గ్రామ పంచాయతీ కాకరపాడు గ్రామానికి రోడ్డు సదుపాయం లేక ఇబ్బందులు పడుతున్నామని రోడ్డు నిర్మించాలని కె.బాలన్న, జి.నీలమ్మ తదితరులు అర్జీని అందజేసారు. పాడేరు మండలం వనుగుపల్లి పంచాయతీ వరంకుర పివిటిజి గ్రామానికి రోడ్డు నిర్మించాలని ఎం.సన్యాసిరావు, కె.బాబూరావు దరఖాస్తును అందజేసారు. అరకువ్యాలీ మండలం పెదగరువు గ్రామం వద్ద కందుల గుడ్రిగెడ్డ వద్ద చెక్‌డ్యాం నిర్మిస్తే 250 ఎకరాలకు సాగునీరందుతుందని చెక్ డ్యాం నిర్మించాలనిపెదలబుడు సర్పంచ్ పెట్టేలి దాసుబాబు కోరారు. ముంచంగిపుట్టు మండలం దోడిపుట్టు పంచాయతీ చిన్న సిందిపుట్టు గ్రామంలో 2015లో నిర్మించిన అంగన్వాడీ భవనానికి బిల్లు మంజూరు చేయాలని కిల్లో రాంబాబు ఫిర్యాదు చేసారు.

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు పరిధి నేరెళ్లవలస గ్రామానికి చెందిన దండు నాగభూషణం (25) ఈ నెల 23వ తేదీన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సిఐ బి.తిరుమలరావు కథనం ప్రకారం... ఇంటర్ చదివి ఆటో, కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న దుంప నాగభూషణం మూడు నెలలుగా మతి స్థిమితం లేకుండా ఉన్నాడు. విశాఖ నగరంలోని ప్రభుత్వ మానసిక వైద్యశాలలో చికిత్స కూడా పొందుతున్నాడు. ఈ నెల 23వ తేదీ ఉదయం 7.30 గంటలకు టిఫిన్ తెమ్మని తల్లి లక్ష్మికి చెప్పాడు. తల్లి టిఫిన్ తెచ్చేసరికి ఇంటి రేకుల షెడ్ తాటి దూలానికి చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు ఎఎస్ఐ యు.నూకరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బరితెగింపు

- సాగులో లేనివారికి పరిహారం జమ
- తహశీల్దార్ ఎండార్స్‌మెంట్ బేఖాతరు
- కూటమి నాయకుల ఒత్తిడికి తలొగ్గిన రెవెన్యూ అధికారులు
- కోడూరు భూమిపై ఎపిఐఐసికి సిఫార్సు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ఇటీవల అనకాపల్లి మండలం కోడూరు సర్వే నెంబర్ 20లో ప్రభుత్వ భూమి 31.77 ఎకరాలకు పరిహారం చెల్లించిన బినామీ సాగుదారుల కూర్పులో పలువురు పాత్ర, సూత్రధారులున్నారు. ప్రభుత్వ భూమిలో సాగుదారులు లేరని 2016 ఫిబ్రవరిలో తహశీల్దార్ ఎండార్స్‌మెంట్ ఇచ్చిన భూమికి బరితెగించిమరీ పరిహారం చెల్లించారు. అందులోనూ, ఆక్రమణలకు అవకాశంలేని రెవెన్యూ సంరక్షణలోని భూమికి పరిహారం చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (ఎపిఐఐసి)కు రెవెన్యూ అధికారులు సిఫార్సు చేశారు. రెవెన్యూ, టిడిపి, జనసేన, వైసిపి నాయకులు కలిసి ప్రభుత్వానికి రూ.6.30 కోట్లు కన్నంపెట్టారు. సాగుదారులు లేకుండానే ఉన్నట్లు జాబితా తయారుచేసి చెల్లింపులు చేసిన విషయం వెలుగులోకి రావడంతో తేలుకుట్టిన దొంగల్లా తప్పించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు.

వివరాల్లోకి వెళితే... కోడూరు సర్వే నెంబర్ 20లో సాగుచేస్తున్న తనను సాగుదారునిగా గుర్తించి భూమికి పరిహారం చెల్లించాలని గొర్లె అప్పలనాయుడు (తండ్రి అప్పలస్వామి) దరఖాస్తు చేసుకోవడంపై అప్పటి ఉమ్మడి విశాఖపట్నం జిల్లా కలెక్టర్ సర్వేకు ఆదేశించారు. మండల సర్వేయర్, ఆర్ఐ, విఆర్ఒ, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే సంయుక్తంగా సర్వే నిర్వహించి సర్వే నెంబర్ 20లోని భూమంతా ఎస్ఎఫ్ఎ, రెవెన్యూ రికార్డుల ప్రకారం రాళ్లమెట్టగా నమోదైవున్నట్లు నివేదికలో పేర్కొన్నారు. కోడూరులో సర్వే నెంబరు 20లోని 39.38 ఎకరాల్లో పిరమ్లెటి ఎడ్యుకేషనల్ సొసైటీకి 25 ఎకరాల బదలాయింపు కోసం 2009 సెప్టెంబరు 30న తహశీల్దార్ ప్రతిపాదనలు పంపారు.

ఇదే భూమిలో కొప్పాకకు చెందిన సుబ్బారెడ్డి వేసిన అక్రమ ఫెన్సింగ్‌ను తొలగించి, 39.38 ఎకరాల భూమి ప్రభుత్వానికి చెందినదిగా గుర్తించి 2003లో తహశీల్దార్ బోర్డులు పెట్టించారు. గ్రామ పెద్దల సమక్షంలో పంచనామా జరిపాక ఈ భూమిలో సాగుదారులెవరూ లేరని తేలడంతో సాగుదారునిగా పేర్లు చేర్చలేమని అప్పలనాయుడు దరఖాస్తును తిరస్కరిస్తూ ఆయనకు 2016 ఫిబ్రవరి 29న తహశీల్దార్ ఎండార్స్‌మెంట్ ఇచ్చారు. భూమి సంరక్షణ బాధ్యతను విఆర్ఒకు అప్పగించారు. సాగుదారులు లేరని తహశీల్దార్ ఎండార్స్‌మెంట్ ఇచ్చిన భూమికి ఎకరాకు రూ.20 లక్షలు చొప్పున ఎపిఐఐసితో పరిహారం ఇప్పించేలా రెవెన్యూ అధికారులు కీలక పాత్ర పోషించారు. తిలాపాపం, తలాపిడికెడు అన్నట్లు టిడిపి, జనసేన, వైసిపి నాయకులు కొందరు కుమ్మక్కై పరిహారం చెల్లించేలా రెవెన్యూ అధికారులపై ఒత్తిడిచేసి ఎపిఐఐసితో డబ్బులు డిపాజిట్ చేయించారు. ప్రభుత్వ భూమిలో సాగులో లేరని తహశీల్దార్ ఎండార్స్‌మెంట్ ఇచ్చిన భూములకు పరిహారం చెల్లించేలా చేశారు. పరిహారం చెల్లింపు విషయమై ఎపిఐఐసి జోనల్ మేనేజర్ నరసింహరావు వద్ద ప్రస్తావించగా... రెవెన్యూ అధికారులు తయారుచేసిన సాగుదారుల జాబితా ప్రకారమే పరిహారం డిపాజిట్ చేశామని తెలిపారు. పరిహారం చెల్లింపులో తమకు సంబంధంలేదని అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారమే సాగుదారుల జాబితా తయారుచేసినట్లు రెవెన్యూ అధికారి ఒకరు తెలిపారు.

రహేజా మైండ్ స్పేస్‌లో విఎంఆర్‌డిఎ రోడ్ షో

ప్రజాశక్తి - ఎంవిపికాలనీ : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్దేశిస్తున్న లక్ష్యాలను చేరుకునేందుకు విశాఖపట్నాన్ని ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేసే లక్ష్యంలో భాగంగా శుక్రవారం హైదరాబాద్ రహేజ మైండ్ స్పేస్‌లో రోడ్‌షో నిర్వహించారు. కార్యక్రమంలో మధురవాడలో ఉన్న విఎంఆర్‌డిఎకి చెందిన మధురవాడ హైట్స్ 87.80 ఎకరాల భూమిని ప్రైవేట్ , పబ్లిక్ పద్ధతిలో ఉమ్మడిగా అభివృద్ధి చేసేందుకు అవకాశాలను వివరించేందుకు రోడ్‌షో ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి జిఎంఆర్, రహేజా, సముద్ర ఇతర ముఖ్యమైన రియాల్టీ డెవలపర్లు హాజరయ్యారు. విశాఖపట్నం ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు ఇతర అనుబంధిత విషయాలపై చర్చించి తమ సంసిద్ధతను వ్యక్తం చేశారని జాయింట్ కమిషనర్ రమేష్ తెలిపారు. ఈ రోడ్‌షోలో పర్యవేక్షక ఇంజినీర్ భవానీశంకర్, ప్రణాళికాధికారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

యువకులను కాపాడిన లైఫ్‌గార్డ్స్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: ఆటవిడుపుగా ఆర్కె బీచ్‌లో స్నానానికి దిగి మునిగిపోతున్న యువకులను జివిఎంసి లైఫ్‌గార్డ్స్ కాపాడారని జివిఎంసి ఇన్‌చార్జి స్పోర్ట్స్ డైరెక్టర్ రాజు శుక్రవారం పత్రికా ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ నుండి 8 మంది యువకులు విశాఖపట్నం విహారయాత్రకు వచ్చారని వారు ఆర్కెబీచ్‌లో స్నానానికి సముద్రంలోకి వెళ్ళగా వారిలో షబ్బీర్ (19), అబ్బాస్ (18) విద్రస్ (16) హుస్సేన్ (18) నలుగురు యువకులు అలల తాకిడికి మునిగిపోతుండగా వారిని జివిఎంసి బీచ్ లైఫ్‌గార్డులు ఎం.ధనరాజు, ఎం.నవీన్, వి.ఆనంద్, సిహెచ్.లక్ష్మణ్‌రావు, కేపిఎస్ వాసు కాపాడారు. అనంతరం పోలీసులకు అప్పగించి కౌన్సెలింగ్ ఇచ్చిన తర్వాత వారిని పంపడం జరిగిందని తెలిపారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఉక్కు కాంట్రాక్టు కార్మికుల తొలగింపులు ఆపాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికుల అక్రమ తొలగింపులు నిలిపివేయాలని, తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, కార్మికుల సమ్మెపై రాష్ట్రప్రభుత్వం పోలీస్ నిర్భంధాన్ని నిలిపివేసేందుకు చర్యలు తీసుకోవాలని సిపిఎం, సిపిఐ, ఎస్‌యుసిఐ, ప్రజాపోరు వామపక్ష పార్టీలతో పాటు విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజాసంఘాల జెఎసి సంయుక్తంగా విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు శుక్రవారం వినతిపత్రం సమర్పించాయి. ఈ సందర్భంగా సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.రెహమాన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఇప్పటికే 3 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించిందని, మరో 2,600 మందిని తొలగించడానికి పూనుకుందని తెలిపారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోవడంతో కాంట్రాక్టు కార్మికులంతా ఈ నెల 20 నుంచి నిరవధిక సమ్మెకు దిగారన్నారు. తక్షణమే యాజమాన్యం, కార్మిక సంఘాలతో కలిసి సమావేశం ఏర్పాటు చేసి, కార్మికుల ప్రధాన సమస్యలను పరిష్కరించి, సమ్మె నిలుపుదలకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. నాయకులు తెలిపిన విషయాలపై ఆయన సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ ప్రజాపోరు జిల్లా కార్యదర్శి ఎస్.దేవా, ఎస్‌యుసిఐ (కమ్యూనిస్టు) రాష్ట్ర కార్యదర్శి ఎస్.గోవిందరాజులు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, సిపిఐ పూర్వ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, సిఐటియు జిల్లా కార్యదర్శి పి.మణి, కెఎం.కుమార్ మంగళం, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు మన్మధరావు, నాగభూణం, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.కృష్ణారావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఉక్కు జెఎసి దీక్షలు

స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారానికి 1505వ రోజుకు చేరుకున్నాయి.

విశాఖకు ప్రపంచవ్యాప్త గుర్తింపు కోసం కృషి

టిడిపి జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ జిల్లా టిడిపికి కంచుకోట అని, అందుకే రాష్ట్రంలో అత్యధిక మెజారిటీ ప్రజలు ఇచ్చారని రాష్ట్ర కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గండి బాబ్జి అన్నారు. జిల్లా టిడిపి కార్యాలయంలో శుక్రవారం బాబ్జి అధ్యక్షతన పార్టీ జిల్లా మహానాడు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖను ప్రపంచస్థాయిలో సిఎం చంద్రబాబు అభివృద్ధి పరుస్తున్నారన్నారు. భీమిలి శాసనసభ్యులు గంట శ్రీనివాసరావు మాట్లాడుతూ సింహాచలం పంచ గ్రామాల సమస్యపై జిల్లా మహాసభలో తీర్మానం చేశామని, మహానాడులో కూడా దీనిపై తీర్మానిస్తామని అన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, శాసనమండలి విప్ వేపాడ చిరంజీవిరావు, శాసన మండలి మాజీసభ్యులు దువ్వారపు రామారావు, విశాఖ సౌత్ ఇన్‌చార్జ్, ఆరోగ్య శ్రీ చైర్మన్ సీతంరాజు సుధాకర్, విశాఖ మేయర్ పీలా శ్రీనివాసరావు, విజయనగరం డిసిఎంఎస్ చైర్మన్ గొంపకృష్ణ జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు, ఉత్తర నియోజకవర్గం నాయకులు వెల్లంకి భరత్, జిల్లా బిసి సెల్ చైర్మన్ తమ్మిన విజయ్‌కుమార్, ఎస్సీ సెల్ చైర్మన్ బుడుమూరు గోవిందు , జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై తీర్మానాలు చేశారు. తొలుత దివంగత ఎన్టీ రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గత మూడు సంవత్సరాల్లో జిల్లాలో చనిపోయిన నాయకులకు కార్యకర్తలకు మౌనం పాటించి నివాళులు అర్పించారు.లోక్‌సభ మాజీ సభ్యులు పెతకంశెట్టి అప్పలనరసింహం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

తప్పు చేస్తే విదేశాల్లో దాక్కున్నా లాక్కొస్తాం :
జగన్‌కు ఎమ్మెల్యే గంటా వార్నింగ్

తప్పుచేశారని తేలితే విజయవాడలోనే కాదు, విదేశాల్లో దాక్కున్నా లాక్కుని వస్తారని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని ఉద్దేశించి భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో జరిగిన పార్టీ జిల్లా మహానాడులో ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత వ్యక్తిగత కక్షసాధింపు రాజకీయాలను పెంచి పోషించారని విమర్శించారు. వైసిపి హయంలో శుక్రవారం వస్తే విశాఖలో ఎవరి భూములకు మూడుతుందో అని భయపడేవారని చెప్పారు. ఎన్నికల్లో విజయసాయిరెడ్డిని పొగిడిన జగన్ ఏడాది తిరగకుండానే ఆయన ప్రలోభాలకు అమ్ముడుపోయారని విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు.

పేదలకు సంక్షేమాన్ని పరిచయం చేసిన ఎన్‌టిఆర్

ఎన్టిఆర్ పేదప్రజలకు సంక్షేమాన్ని పరిచయం చేసిన కారణజన్ముడని చెప్పారు. పార్టీని చంద్రబాబునాయుడు సంస్థాగతంగా బలోపేతం చేసి అనేక పాలనా సంస్కరణలను తీసుకువచ్చారని ప్రశంసించారు..



ఎన్‌టిఆర్‌కు నివాళి అర్పిస్తున్న టిడిపి నాయకులు

సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు

సమీక్షలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

ప్రజాశక్తి - విశాఖకలెక్టరేట్: ఈ నెల 25వ తేదీన నిర్వహించే సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు.ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని, విశాఖ పరిధిలోని 19 పరీక్షా కేంద్రాల్లో జామర్లు ఏర్పాటు చేయాలని బెల్ అధికారులకు సూచించారు. పరీక్షకు 8,424 మంది అభ్యర్థులు హాజరుకానున్న నేపథ్యంలో తాగునీరు, టాయిలెట్ల వంటి కనీస వసతులు కల్పించాలన్నారు. శుక్రవారం కలెక్టరేట్ మీటింగు హాలులో జెసి, డిఆర్వో,ఇతర అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఆయా కేంద్రాల ఇన్‌చార్జి అధికారులు, సంస్థల నిర్వాహకులు ఏమైనా సమస్యలు ఉత్పన్నమైనట్లయితే కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసే కంట్రోల్‌రూమ్‌కు సమాచారం అందించాలని, సందేహాలను నివత్తి చేసుకోవాలని సూచించారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్

యుపిఎస్సి ఆధ్వర్యంలో సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా ముందుజాగ్రత్త చర్యగా కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. 0891-2590100, 0891-2590102 నంబర్లను అందుబాటులో ఉంచుతు న్నామని, ఏమైనా సమస్యలుంటే నంబర్లను సంప్రదించాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద మౌలికవసతుల కల్పనతో పాటు నిరంతరాయ విద్యుత్ సరఫరా, తాగునీరు అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్ష రెండు సెక్షన్లలో అనగా ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు జరుగుతుందన్నారు. అభ్యర్థులు గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. అభ్యర్థులు ఈఐడీ కార్డు లేదా గుర్తింపు పొందిన ఐడి కార్డులను తీసుకురావాలని, ఒకవేళ ఐడి కార్డులు తీసుకురాలేని యెడల సెల్ఫ్ డిక్లరేషన్ ఫారం సమర్పించాలని సూచించారు. పరీక్ష నిర్వహణకు సంబంధించి విధివిధానాలు గురించి జాయింట్ కలెక్టర్ కె.మయూర్‌అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి బిహెచ్. భవానిశంకర్, యుపిఎస్సి డైరెక్టర్ పట్నాయక్ సూక్ష్మంగా వివరించారు. సమావేశంలో వివిధ విభాగాల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

హత్యకేసు ఛేదన

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : విశాఖపట్నం పోలీస్ కమిషనరేట్ మహారాణిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో 2021 డిసెంబర్ 21న అదృశ్యమైన మహిళ హత్యకు గురైందని నగర పోలీస్ కమిషనర్ డా.శంఖబ్రాత బాగ్చి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2021 డిసెంబర్ 21న జగదాంబ ప్రాంతానికి చెందిన పల్లా సునీత (45) భర్తతో విభేదాల కారణంగా పిల్లలను విడిచిపెట్టి ఒంటరిగా ఉంటోందని, 2022 జనవరిలో ఆమెపై మిస్సింగ్ కేసు నమోదైందని అప్పటి సిబ్బంది ఆమె గురించి గాలింపు చేపట్టినప్పటికీ తగిన ఆధారాలు లభించక అకేసును అన్‌డిటెక్టబుల్ కేసుగా క్లోజ్ చేశారన్నారు. తన తల్లి ఆచూకీ కావాలని మృతురాలి కుమార్తె ఆబోతు సునీత పది రోజుల క్రితం తన సంప్రదించిందని వెంటనే ఆ కేసును రీ ఓపెన్ చేసి ఇన్‌స్పెక్టర్ షేక్ హుస్సేన్ ఆధ్వర్యంలో ప్రత్యేక బందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు చేశామన్నారు. 2021 డిసెంబర్‌లో అలుగు దివాకర్ అనే వ్యక్తి ఆమెను హత్య చేసినట్టు గుర్తించామన్నారు. ఆమె రియల్ ఎస్టేట్ ఏజెంట్‌గా పనిచేసేదని ఆమె నివసించే ప్లాట్ నిర్మాణదశలో బిల్డర్‌తో వచ్చిన ఇబ్బందులను పరిష్కరించడంలో ముద్దాయి దివాకర్ ఆమెకు సహకరించాడు. దీంతో ఆమె తన ప్లాటులో ఒక రూమును దివాకర్ రియల్ ఎస్టేట్ ఆఫీస్ పెట్టుకోవడానికి అంగీకరించింది. అతనికి చాలావరకూ డబ్బు కూడా ఇచ్చిందని పోలీస్ కమిషనర్ తెలిపారు. అనంతరం వారిద్దరి మధ్య సాన్నిహిత్యం పెరిగా దివాకర్ ను వివాహం చేసుకోవాలని బుచ్చిరాజుపాలెంలో అతడి నివాసానికి వెళ్లి ఒత్తిడి చేసింది. దివాకర్ ఆవేశంతో ఆమె తలను గోడకు బలంగా కొట్టడంతో ఆమె మృతి చెందింది. అనంతరం హైదరాబాద్‌కు చెందిన తన స్నేహితుడు వరప్రసాద్ సహాయంతో ఆమె శరీరాన్ని దుప్పట్లో చుట్టి తన కారులో తూర్పుగోదావరి జిల్లా ఎర్రవరం వద్ద పారుతున్న ఎర్రకాలువలో అర్ధరాత్రి సమయంలో పడేసారని అనంతరం ఇరువురు హైదరాబాదులో కొంతకాలం ఉండి విశాఖ వచ్చారని ఆయన తెలిపారు. మృతురాలి కోసం ఆమె పిల్లలు దివాకర్‌ను సంప్రదించగా తిరుపతి వెళ్ళినట్టు చెప్పాడన్నారు. ముద్దాయి వాంగ్మూలం ఆధారంగా కేసు ఛేధించామని రిమండ్‌కు పంపిస్తున్నామని తెలిపారు. కేసును కేవలం పది రోజుల్లోనే ఛేధించిన సిబ్బంది పి.సి.ఆర్ ఇన్‌స్పెక్టర్ ఎస్.కె.హుస్సేన్, సి.సి.ఎస్ ఎఎస్ఐ పి.చంద్రశేఖర్, కానిస్టేబుళ్ళు ఎన్.ఎ రాజు, వినోద్, రామరాజులకు పోలీస్‌కమిషనర్ కార్యాలయంలో ప్రశంసాపత్రాలను అందజేశారు.



సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న విమ్స్ డైరక్టర్ డాక్టర్ రాంబాబు

విమ్స్‌లో కోవిడ్ వార్డు సిద్ధం

ప్రజాశక్తి - ఆరిలోవ : ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన కరోనా మరో రూపాంతరం చెంది విజృంభిస్తున్న సమయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైందని విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్) డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు తెలిపారు. సరికొత్త వేరియంట్ జెఎన్ 1, ఎల్ఎఫ్ 7, ఎన్‌బి 1.8 ఆందోళన కలిగిస్తున్న తరుణంలో ప్రభుత్వం ఆదేశాల మేరకు విమ్స్ ఆస్పత్రిలో 20 పడకలతో ప్రత్యేకవార్డు సిద్ధం చేసినట్లు శుక్రవారం ఆయన తెలిపారు. నగరంలో ఒక కేసు నమోదు కావడంతో కోవిడ్ వైద్యపరీక్షల నిమిత్తం రాపిడ్‌కిట్లను కూడా అందుబాటులోకి తీసుకొచ్చామని పేర్కొన్నారు. రాపిడ్ కిట్‌లో పాజిటివ్ అని వస్తే వెంటనే ఆర్‌టిపిసిఆర్ పరీక్షలకు పంపించి కోవిడ్ నిర్ధారణ చేయనున్నట్లు తెలిపారు. ముందు జాగ్రత్తచర్యలో భాగంగా కోవిడ్ రోగులకు వైద్యం అందించేందుకు వైద్యులకు, సిబ్బందికి పిపి కిట్లను, రోగులకు అవసరమైన మందులను సమకూర్చుకున్నట్లు వివరించారు. కోవిడ్ కొత్త వేరియంట్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, భౌతికదూరం పాటిస్తూ, సామూహిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని కోరారు. వృద్ధులు, గర్భిణులు ఇళ్లకే పరిమితం కావాలని సూచించారు. మాస్కుల వినియోగం, నిరంతరం శానిటేషన్ చేసుకోవడం తప్పనిసరి అని పేర్కొన్నారు.